

శంబర జాతర నిర్వహణపై రేపు సమీక్ష

మక్కువ రూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర భక్తుల ఇల వేల్పు శంబర పోలమాంబ జాతర నిర్వహణపై శుక్రవారం చదురుగుడి ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో బి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 26, 27, 28 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.



ముస్తాబు అదుర్స్

- సచివాలయంలో ప్రస్తావించిన సీఎం చంద్రబాబునాయుడు
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు
- విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా చర్యలు
- రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ఆదేశం

పార్వతీపురం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో 'ముస్తాబు'కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసలు దక్కాయి. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సదస్సులో సీఎం దీనిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రతి తరగతి గది బయట బకెట్‌తో నీరు, సబ్బు, అద్దం, టవల్, దువ్వెన, పౌడర్ అందుబాటులో ఉంచి.. విద్యార్థులు పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవడం గొప్ప విషయ మన్నారు. కేవలం రెండు నెలల కాలంలో ముస్తాబు కార్యక్రమంతో మంచి ఫలితాలు సాధించిన కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఆర్థిక భారం లేని ఇటువంటి కార్యక్రమాల నిర్వహణపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఆదేశించారు. గిరిజన పాఠశాలల్లో అద్దం పెట్టాలని గతంలో ఒకసారి ప్రధాన మంత్రి మోదీ తన వద్ద ప్రస్తావించారన్నారు. దీనివల్ల పిల్లలు పరిశుభ్రంగా తయారై పాఠశాలలకు వచ్చే ముందు అద్దం చూసుకుంటారన్న మాటలు.. ముస్తాబు కార్యక్రమం చూసిన తర్వాత తనకు గుర్తుకొచ్చాయని వెల్లడించారు. ఏదేమైనా పిల్లల ఆరోగ్య సంరక్షణకు

(మిగతా 10వ పేజీలో...)



కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



విశ్వనాథపురం పాఠశాలలో ఓ విద్యార్థికి అద్దం చూపిస్తూ తల దువ్వుతున్న క్లాస్ లీడర్లు (ఫైల్)



వీరఘట్టం: రూపురేఖలు మారనున్న నర్సిపురం- దశమంతుపురం రహదారి

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలోనే పనులకు శ్రీకారం

పార్వతీపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. నాలుగు నియోజకవర్గాల్లోని 23 రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.42.37 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే 80.249 కిలోమీటర్ల పొడవున రహదారులను నిర్మించనున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. గ్రామీణ ప్రాంత రోడ్లకు ఒక్క రూపాయి కేటాయించలేదు. జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులకు అనుసంధానంగా ఉన్న పల్లె రోడ్లన్నింటినీ నిర్లక్ష్యం చేసింది. దీంతో ఎక్కడికక్కడ గుంతలు పడ్డాయి. అడుగుకో గొయ్యి ఏర్పడడంతో ద్విచక్ర వాహన దారులు అదుపుతప్పి కింద పడేవారు. ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ఆసుపత్రి పాలయ్యారు. అత్యధిక గ్రామాలకు అనుసంధానంగా వున్న ప్రధాన రహదారులను కూడా బాగు చేసేందుకు ఆలోచన చేయలేదు. ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్లను బాగు చేయాలని నిర్ణయించింది. బాగా పాడైన రోడ్లను తొలుత మార్చాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకుంటోంది. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్ (సాస్కి) కింద నాబార్డ్ ఈ నిధులను కేటాయించింది. రోడ్లను బాగు చేయనుండడంతో ఆయా గ్రామాల ప్రజల నుంచి ఆనందం వ్యక్తమవుతోంది.


ఫైళ్ల క్లియరెన్స్‌లో ర్యాంకులు

- ప్రకటించిన ప్రభుత్వం
- 19వ స్థానంలో మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రుల వారీగా ప్రభుత్వం బుధవారం ర్యాంకులు ప్రకటించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి 19వ స్థానంలో , కొండపల్లి శ్రీనివాస్ పదో స్థానంలో నిలిచారు. ఎనిమిది రోజుల్లో మంత్రి సంధ్యారాణి 545 ఫైళ్లలో 530 క్లియర్ చేశారు. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తొమ్మిది రోజుల్లో 119 ఫైళ్లకు గాను 113 , జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి మూడు రోజుల్లో 152 ఫైళ్లలో వంద ఫైళ్లకు క్లియరెన్స్ చూపారు. కాగా తొలిస్థానంలో డోల బాలవీరాంజనేయస్వామి , సీఎం చంద్రబాబు ఆరోస్థానంలో, మంత్రి నారా లోకేశ్ 9వ స్థానంలో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 11వ స్థానంలో ఉన్నారు.

పశుపోషణ కష్టమే





- యంత్రాల వినియోగంతో లభ్యంకాని వరిగడ్డి
- ట్రాక్టరు లోడు రూ.5 వేలు పైమాటే
- పాడి రైతులపై పెనుభారం

రాజాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతుండడం శుభ పరిణామం. అయితే ఆ యంత్రాలు పాడి పశువులకు మాత్రం శాపంగా పరిణమించాయి. ప్రధానంగా వరి నూర్పులు చేపట్టే యంత్రాలతో గడ్డి పూర్తిగా ధ్వంసమవుతోంది. పశువుల మేతకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. దీనివల్ల పాడి పశువుల పెంపకానికి రైతు వేరేగా గడ్డి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ పరిణామంతో లక్షలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరి గడ్డి లభ్యంకాక అయోమయంలో పడుతున్నారు. గతంలో వరి పంటను కూలీలతో మాత్రమే కోయించి సంప్రదాయ విధానంలో నూర్పులు చేసేవారు. మరికొందరు చొప్పలు కట్టించి కొట్టించేవారు. అలా మిగిలిన చొప్పతో ఇళ్ల పైకప్పులు వేసేందుకు వాడుకునేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. చొప్పతో ఇళ్లు నేయడం దాదాపు తగ్గిపోయింది. అదే సమయంలో నూర్పు యంత్రాలతో వరి గడ్డి పూర్తిగా ధ్వంసమవు తోంది.



ముక్కుముక్కలైపోతోంది. పశువుల మేతకు ఉపయోగపడడం లేదు. దీనివల్ల గడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. గతంలో పశువు లతో నూర్పులు చేసి గడ్డిని ఏడాదిపొడవునా మేతగా వేసేవారు. నేడు యంత్రాల పుణ్యమా అని వరిగడ్డి మిగలడం లేదు. పశువులకు సరైన ఆహారం దొరక డం లేదు. జిల్లాలో వేలాది సంఖ్యలో ఆవులు, ఎద్దు జాతి పశువులు ఉన్నాయి. కాగా సుమారు 2 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. కానీ భారీ యంత్రాలతో వరి కోతలు, నూర్పులు చేస్తుండడంతో వరి గడ్డి ఉపయోగపడడం లేదు.

సొమ్ముచేసుకుంటున్న వైనం..

వరి గడ్డికి ఉన్న డిమాండ్‌ను కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టరు లోడు గడ్డిని రూ.4 వేల వరకూ విక్రయిస్తున్నారు. గతంలో లోడు గడ్డి కేవలం రూ.1000 మాత్రమే ఉండేది. ఈ ఏడాది రూ.5 వేలు పైబడినా ఆశ్చర్యపోనవసరం లేదని రైతులు చెబుతున్నారు.

మరువాడలో స్క్రబ్ టైఫస్ కలకలం

- అప్రమత్తమైన వైద్య సిబ్బంది

బొండపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా మరువాడ గ్రామంలో ఓ చిన్నారికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్ రావడం గ్రామంలో కలకలం చోటు చేసుకుంది. సోమవారం ఆ నాలుగేళ్ల చిన్నారికి తీవ్ర జ్వరం రావడంతో దేవుపల్లి పీహెచ్‌సీలో పరీక్షలు చేశారు. అనంతరం గజపతినగరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ మరోసారి పరీక్షించారు. బుధవారం నాటికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా ధ్రువీకరించారు. అయితే బాలికకు ఎటువంటి ప్రాణాపాయం లేదని దేవుపల్లి వైద్యాధికారి ఆకెళ్ల శర్మిష్ట తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అనారోగ్యానికి గురైనవారికి వైద్య పరీక్షలు జరిపినట్టు చెప్పారు. మరోవైపు సర్పంచ్ డోకల పార్వతి గ్రామంలో పూడికలు తొలగించి తాగునీటి వనరుల క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

భామిని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి.. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. బుధవారం భామినిలో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. సబ్జెక్టులపై సందేహాలను నివృత్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం

(మిగతా 10వ పేజీలో...)



ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి పీవో

అడ్డుగా ఉన్నాయని..

- ఆర్‌ఎస్‌కే నుంచి గన్నీ బ్యాగ్‌లను బయటపడేశారు

పాలకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అవలంగి రైతు సేవా కేంద్రంలోని ధాన్యం గోనె సంచులను ఓ వ్యక్తి బయట పడేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సాయంత్రం సుమారు నాలుగు వందల గన్నీ బ్యాగ్‌లు రైతు సేవా కేంద్రానికి వచ్చాయి. వీటిని ఆర్‌ఎస్‌కేలో కలాసీలు భద్రపరిచారు. అయితే తమ కార్యకలాపాలకు అడ్డుగా ఉన్నాయని వాటిని ఓ వ్యక్తి మరో వ్యక్తితో కలిసి బయట పడేసినట్టు రైతులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ఏఈవో శ్రావణి అక్కడకు చేరుకుని.. గన్నీ బ్యాగ్‌లను తిరిగి భద్రపర్చాలని కోరారు. అయితే అవి తమకు అడ్డంకిగా ఉన్నాయని వాదించినట్టు తెలుస్తోంది. దీనిపై ఏఈవోను వివరణ కోరగా.. గన్ని బ్యాగ్‌లను తిరిగి భద్రపర్చాలని కోరామన్నారు. అయితే స్థానిక రైతులు మాత్రం వాటిని వ్యాన్‌లో ఎక్కించి వేరే చోటకు తరలించారన్నారు.

వాస్తవంగా ఈ ఆర్‌ఎస్‌కేని పంచాయతీ కార్యాలయంగా కూడా వినియోగిస్తున్నారు. అయితే 2020 నుంచి ఎరువులు, ఇతర సామగ్రిని ఇక్కడే భద్రపరుస్తుండగా.. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకుని రైతులు ప్రశ్నిస్తున్నారు.



రైతు సేవా కేంద్రం నుంచి గన్నీ బ్యాగ్‌లను బయట పడేసిన దృశ్యం

బడి భోజనానికి సెలవు లేదు
- టెన్త్ విద్యార్థులకు ప్రయోజనం
8లో

అదనపు లోడుకు మరో అవకాశం
- 50 శాతం రాయితీ
- డిసెంబరు 31 వరకు గడువు
8లో

ఉద్యోగ భద్రత కల్పించాలి
10లో
మానవ హక్కులను పరిరక్షించాలి

ప్రకృతి సాగుతో నిరంతర ఆదాయం

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం రూరల్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు నిరంతర ఆదాయం పొందొచ్చని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బందలుప్పి గ్రామంలో ఓ రైతు పొలాన్ని సందర్శించి.. అక్కడ సాగుచేస్తున్న వివిధ రకాల పంటల వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్‌ను పరిశీలించారు. ఏటీఎం మోడల్‌లో దొండ, రిలే సోయింగ్ పద్ధతిలో చిక్కుడు, వరుసల మధ్యలో మిరప, బంతి, ఆకుకూరలు వంటి వాటి సాగు చేస్తూ.. ఇప్పటివరకు రూ.80 వేలు ఆదాయం పొందినట్లు మురళీ అనే రైతు కలెక్టర్‌కు వివరించారు. పొలం గట్లపై సాగు చేసిన పంటల ద్వారా రూ.20 వేలు అదనపు ఆదాయం వచ్చిందని, ప్రకృతి సాగు ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ.. ప్రతి రైతు ఇటువంటి మోడల్స్‌ను అనుసరించాలన్నారు. బహుళ పంటల విధానం ద్వారా ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. 365 రోజులూ సాగు చేపట్టడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో డీఏవో అన్నపూర్ణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి, ఏడీఏ వెంకటేష్, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకులు ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు తదితరులున్నారు.



పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

టెట్ ప్రారంభం

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారం ప్రారంభమైంది. మొదటిరోజు విజయనగరం జిల్లాలోని మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్ విధానంలో రెండు సెషన్లలో పరీక్ష జరిగింది. ఉదయం 590 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 553 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 561 మంది రాయాల్సి ఉండగా 496 మంది రాశారు. పరీక్ష కేంద్రాలను విజయనగరం డీఈవో మాణిక్యం నాయుడు తనిఖీ చేశారు.

వారం రోజుల్లో ఎల్పీ సర్టిఫికెట్లు
- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
10లో

అటవీ హక్కులపై అవగాహన కల్పించండి

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల చట్టంపై గిరిజనులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఐటీడీఏలో ఎన్‌జీవో ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. వారి సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కార మార్గం చూపాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌ఆర్‌ఏ విభాగపు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.ఆదినారాయణరావు, ఏపీవో మురళీధర్, ఆర్‌వోఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

బడి భోజనానికి సెలవు లేదు



● పదో తరగతి విద్యార్థులకు ప్రయోజనం

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో నూరుశాతం ఫలితాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. ఇందుకోసం వంద రోజుల ప్రణాళికను ప్రకటించి అమలు చేస్తోంది. పరీక్షల వరకు ఇవి కొనసాగుతాయి. ఉపాధ్యాయులు సెలవు దినాల్లోనూ తరగతులు నిర్వహిస్తారు. అ సమయంలో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. బడిలోనే వడ్డించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

21 వేలు మందికి ప్రయోజనం..

పతో తరగతి విద్యార్థులు విద్యార్థులకు మార్చి 16వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. వీరికి ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పాఠశాలల్లో తరగతులు జరుగుతున్నాయి. సెలవు రోజుల్లో షెడ్యూలు మారుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు ఉంటాయి. ఆ రోజుల్లో పిల్లల ఆకలి బాధకు గురికాకుండా ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో మోనూ ప్రకారం భోజనాన్ని అందించేలా పాఠశాలల మధ్యాహ్న భోజనపథకం సంచాలకులు బి. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 23,193 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో 6,878 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నారు.

విద్యార్థులకు ఆకలి సమస్య లేకుండా..



పదో తరగతి విద్యార్థులకు సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వారికి ఆకలి సమస్య లేకుండా చూడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈవి ధానం అమలు చేసింది. దీనివల్ల జిల్లా వ్యాప్తంగా 298 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 16,315 మంది విద్యార్థులు ఈ నెల 6 నుంచి పది పరీక్షలు పూర్తయ్యే వరకు సెలవుల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తాం.

-మాణిక్యం నాయుడు,
జిల్లా విద్యాశాఖ అధికారి



నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

విజయనగరం కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హర్ష కళానికేతన్ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతిలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు, పౌరాణిక నాటకాలు అందరినీ అలరించాయి. నంది అవార్డు గ్రహీత రెడ్డి తవిటినాయుడు 86వ జయంతి సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మయసభతో పాటు, సత్యహరిశ్చంద్ర కాటిసీను వంటి ఏకపాత్రాభినయాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, విద్యావేత్త గంటా అప్పలనాయుడు, డాక్టరు పీవీజీ రాజు స్మారక నాటక పరిషత్ వ్యవస్థాపకుడు నాలుగెస్సల రాజు, గోవిందపురం మాజీ సర్పంచ్ విక్రం జగన్నాథం, కళాకారుడు బి.శ్రీనివాససరావు, రెడ్డి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించండి

● జిల్లా వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

టెట్ నుంచి ఇన్‌సర్వీసు టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్‌చేశారు.ఈ మేరకు జిల్లాలోని డిప్యూటీ డీఈవో కార్యాలయాలు, విద్యావనరుల కేంద్రాల ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

బొబ్బిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి డిప్యూటీ డీఈవో కార్యాలయం ఎదుట 2010కి ముందు ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేత విజయగౌరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టెట్‌ను రద్దు చేయాలని, కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, పదోతరగతి విద్యార్థులకు వందరోజుల యాక్షన్‌ప్లాన్ అమలులో భాగంగా జనరల్ సేవలను మినహాయించాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 18న కలెక్టరేట్ ముందు, జనవరి 28న ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు,స్వామినాయుడు, సత్యనారాయణ, సుధాకర్, శంకరరావు పాల్గొన్నారు.



బొబ్బిలి: బొబ్బిలి డిప్యూటీ డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



చీపురుపల్లి: విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



రాజాం: ర్యాలీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

● చీపురుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు మాట్లాడుతూ 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వందరోజుల యాక్షన్ ప్లాన్ నుంచి ఆదివారాలు, పబ్లిక్ సెలవులు మినహాయించాలని కోరారు.

టెట్ నుంచి మినహాయింపునివ్వాలి..

రాజాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణులవ్వాలన్న నిబంధన ఎంత మాత్రం సమంజసం కాదని... దీని నుంచి మినహాయింపునివ్వాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్లపై పెద్ద ఎత్తున నినదించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఎం.రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి పక్కి వాసు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మారెళ్ల కృష్ణమూర్తి, ఎ.వెంకటప్పలనాయుడు, ముప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు లోడుకు మరో అవకాశం



● 50 శాతం రాయితీ ● డిసెంబరు 31 వరకు గడువు

రాజాం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి)

గృహావసరాలలో ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం పెరిగిందా..? విద్యుత్ వాడకం ఎక్కువవుతోందా..? ఇప్పటికే మీ ఇళ్లకున్న సర్వీసులపై అదనపులోడు పడుతోందా? అయితే వెంటనే ప్రభుత్వం కల్పిస్తున్న 50 రాయితీని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇందుకు అవసరమైన డిపాజిట్‌ను చెల్లించి అదనపులోడును క్రమబద్ధీకరించుకోవచ్చును. ఈ అవకాశం ఈనెల 31 వరకు మాత్రమే ఉందని అంటున్నారు. గతంలో ఈఏడాది మార్చి 1 నుంచి జూన్ 30 వరకు ట్రాన్స్‌కో ఇలాంటి అవకాశాన్ని కల్పించింది. జిల్లాలో చాలామంది రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అయితే ట్రాన్స్‌కో అదనపులోడు క్రమబద్ధీకరణకు మరో అవకాశాన్ని కల్పించింది. ట్రాన్స్‌కో విజయనగరం రూరల్ డివిజన్ ఈఈ సురేష్‌బాబు ఈ వివరాలు తెలిపారు.

సరఫరాలో ఇబ్బందులు లేకుండా..

చాలామంది వినియోగదారులకు తాము వినియోగిస్తున్న విద్యుత్‌లోడు ఎంత ఉందో తెలియని పరిస్థితి. కొత్తమీటర్‌కు దరఖాస్తు చేసుకున్న సమయంలో గ్రామీణ ప్రాంతాలలో ఒక కిలోవాట్, పట్టణ ప్రాంతాలలో రెండు కిలోవాట్లకు దరఖాస్తు చేసుకుంటారు. కనెక్షన్ పొందిన తరువాత నమోదు చేసిన దానికన్నా ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్, మిక్సీ గ్రైండర్, గీజర్, ఐరన్‌బాక్స్‌తో పాటు మరిన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు వాడుతుంటారు. ఫలితంగా విద్యుత్ లోడు ఎక్కువ అవుతుంది. ఇదే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో పాటు లోఓల్టేజీ సమస్యల తలెత్తే వీలుంది. అదనపు లోడును క్రమబద్ధీకరించుకోకుండా విద్యుత్‌ను వాడుకుంటున్న వారిని గుర్తించి ట్రాన్స్‌కో అధికారులు అపరాధ రుసుము విధిస్తున్నారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా గృహ వినియోగానికి అవసరమైన విద్యుత్‌ను దర్జాగా వాడుకునేందుకు వీలుగా ట్రాన్స్‌కో అదనపులోడు క్రమబద్ధీకరణకు మరో అవకాశం కల్పించింది.

కట్టాల్సిన మొత్తం (రూ.లలో) ఇలా..

కి.వా.	సాధారణ ఛార్జీ	రాయితీ పోను
1	2250	1250
2	4450	2450
3	6650	3650
4	8850	4850
5	11050	6050

క్రమబద్ధీకరించుకోవాలి..

అదనపులోడు వాడుతున్న విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్‌కో కల్పించిన రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అదనపులోడుకు సంబంధించి నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజీ వంటి సమస్యల నుంచి బయటపడాలి. ట్రాన్స్‌కో నిర్వహించే దాడుల్లో బయటపడితే జరిమానా తప్పదు. ఈనెల 31 వరకు రాయితీ సౌకర్యం ఉంది.

-సురేష్‌బాబు, ఈఈ, ట్రాన్స్‌కో,
విజయనగరం రూరల్ డివిజన్



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

తల్లిదండ్రుల శ్రమను విద్యార్థులు గుర్తించాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల శ్రమను విద్యార్థులు గుర్తించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎస్పీ దామోదర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఓ పాఠశాలలో మానవ హక్కుల దినం సందర్భంగా నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, ఏబీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్పీ దామోదర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంచి విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు హక్కు ఉందన్నారు. ప్రలోభాలకు లొంగడం, ఆకర్షణకు లోనుకావడం, సోషల్ మీడియాకు అలవాటు కావడం వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, రీల్స్ ట్విట్టర్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలతో లక్ష్యం దెబ్బతింటుందని చెప్పారు. ఆకతాయిల మాయమాటలు నమ్మి అమ్మాయిలు మోసపోవద్దన్నారు. అమ్మాయిలు ఈవ్ టీజింగ్‌నకు గురైతే డయల్ 100, 112కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ. కృష్ణప్రసాద్, డాక్టర్ ఎంఎస్ స్వరూప్, సెట్విజ్ సీఈఓ హంసిక, నిత్యశ్రీ, డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎస్పీ గోవిందరావు, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, అంబేడ్కర్, సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి

అతి పురాతనమైన ధర్మం మనది

కొత్తవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పురాతనమైన సనాతన ధర్మం కలిగినది హిందూ మతమని శ్రవణచైతన్యానంద చిన్న స్వామి అన్నారు. బుధవారం స్థానిక భారత్ డిఫెన్స్ అకాడమీకి చెందిన ఆట స్థల ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్, హిందూ సమ్మేళనం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రపంచ దేశాలలో హిందూ మతం, మనదేశ సంస్కృతి, సంప్రదాయాలపై ఎంతో గౌరవం పెరిగిందన్నారు. మన సనాతన ధర్మానికి వేలాది సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. భగవద్గీత ప్రపంచ దేశాలకు మార్గదర్శకమన్నారు. ప్రపంచంలోని ఏ మూలలో జరిగిన ఆవిష్కరణకైనా మూలాలు మన రామాయణ, భారతాలలో ఉంటాయని తెలిపారు. మన దేశంలో పుట్టిన యోగా ఇప్పుడు ప్రపంచ దేశాలకు విస్తరించిందన్నారు. మంగళపాలెం గ్రామానికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, కొరుపోలు అప్పారావు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ పక్కాగా చేపట్టాలి

● జేసీ సేతుమాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. బుధవారం రెవెన్యూ అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ధాన్యం సేకరణ, అందరికీ గృహాలు, వెబ్‌ల్యాండ్, మ్యుటేషన్, పీజీఆర్ఎస్‌పై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1,08,687 మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తయినట్టు తెలిపారు. రైతుల నుంచి పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని చెప్పారు. జిల్లాలోని 17,578 మంది రైతుల నుంచి ధాన్యం సేకరిం చినట్టు చెప్పారు. వీరికి రూ185.93 కోట్లు చెల్లించామని తెలిపారు. ఇప్పటి వరకూ బ్యాంకుల నుంచి రూ.172.84 కోట్లు బ్యాంకు గ్యారెంటీలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారులను సంప్రదించాలని తెలిపారు. అవసరమైన గన్నీ సంచులను ఏర్పాటు చేయాలని సివిల్ సప్లయిస్ డీఎంకు సూచించారు. ఎక్కడైనా ధాన్యాన్ని తీసుకొని బీజీలు సమర్పించకపోయినా సంబంధిత మిల్లులను డీ ట్యాగ్ చేయాలని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ల హాజరు ప్రతి రోజు పెట్టాలని.. హాజరు కాని వారిని తొలగించాలని ఆదేశించారు.

ధాన్యం మిల్లుల్లో వాస్తవ పరిస్థితిపై నివేదిక

● బొబ్బిలి మండలంలోని మిల్లులు పరిశీలించిన అధికారులు



కృష్ణాపురంలో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం మిల్లుల్లో వాస్తవ పరిస్థితులను నివేదిక రూపంలో పంపిస్తామని అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని కోమటిపల్లి, కృష్ణాపురం, గొల్లపల్లిల్లోని రైస్ మిల్లులను విశాఖ పట్నం డీఎం శ్రీలత, విజయనగరం పౌర సరఫరాల అసిస్టెంట్ మేనేజర్ శ్రీరామ్, శ్రీకాకుళం అసిస్టెంట్ మేనేజర్ విజయరాజు తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుత పంట కాలంలో కొనుగోలు చేసిన ధాన్యం మిల్లింగ్‌పై ఆరాతీశారు. నూకలు, తేమ శాతంపై రైస్ మిల్లు యజమానులతో చర్చించారు. టెస్ట్ మిల్లింగ్‌లో ఆడిన ధాన్యంలో ఎక్కువగా ముక్కలై నూకలుగా వస్తున్నాయని మిల్లర్లు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి అధికారులను పంపించింది. దీంతో అధికారులు ఆయా మిల్లుల్లో టెస్ట్ మిల్లింగులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కానిస్టేబుల్ అభ్యర్థులు 15న హాజరు కావాలి

విజయనగరం క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు ఈనెల 15న జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉదయం 5 గంటలకు హాజరుకావాలని ఎస్పీ దామోదర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థితో పాటు మరో ఇద్దరు (వారి తల్లిదండ్రులు) అక్క, అన్న లాంటివారు మొత్తం ముగ్గురు హాజరు కావాలన్నారు. వారిని విజయవాడ తీసుకువెళ్తామన్నారు. ఈ నెల 16న మంగళగిరి బెటాలియన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖాముఖి నిర్వహించి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. అక్కడే ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. అక్కడి నుంచి అభ్యర్థులు తిరిగి తమ సొంత ఊళ్లకు వెళ్లి ... ఈ నెల 22 నుంచి విజయనగరం పీటీసీ, డీటీసీలో జరిగే శిక్షణకు హాజరుకావాలని కోరారు.

హక్కులు పొందండి

లక్కవరపుకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠాల్లో భూములు ఉన్న ప్రతి ఒక్కరూ వాటిపై హక్కులు పొందాలని ఈవోఆర్డీ కుమార్ తెలిపారు. సర్పంచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించి గ్రామస్థులకు స్వామిత్వ సర్వేపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇళ్లతో పాటు ఖాళీగా ఉన్న స్థలాలపై ఈ సర్వే ద్వారా హక్కు పొందవచ్చని తెలిపారు. సర్వేలో నమోదైన భూములపై అధికారికంగా క్రయ విక్రయాలు చేసుకోవచ్చని కార్యదర్శి సత్యవతి పేర్కొన్నారు.

ఘోషాసుపత్రిలో ఆధునిక పరికరాలు

విజయనగరం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఘోషాసుపత్రిలో వసుధ ఫౌండేషన్ నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ వైద్య పరికరాలు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ వైద్య పరికరాలు ఏర్పాటు కావడం వల్ల తల్లీపిల్లలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

అగ్ని బాధితులను ఆదుకోండి

ఎస్.కోట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిమిడి గ్రామంలో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కొరుకొండ రాముడు, సోములమ్మ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ త్రినాథమ్మ, జనసేన నేత సన్యాసినాయుడు కోరారు. బుధవారం గ్రామంలో ఉన్న రాముడు ఇంట్లో వంట చేస్తుండగా మంటలు వ్యాపించి ఇల్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనువాసరావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వీరికి రూ.రెండు వేల వంతున నగదు, 50కేజీల చొప్పున బియ్యం ప్రభుత్వం తరఫున అందించారు. బాధిత కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని సన్యాసినాయుడు కోరారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి

రేగిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నియంత్రణకు చైల్డ్ ప్రొటె క్ట్ కమిటీలు పని చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాల్యవివాహాల నియంత్రణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే లక్ష్యంతో పని చేయాలని ఈ కమిటీ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

గరివిడి, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): గరివిడి- రాజాం రోడ్డులో ప్రమాదాల నియంత్రణకు డీఎస్పీ రాఘవులు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. బుధవారం గరివిడి పోలీసు స్టేషన్ వద్ద రేడియం స్టిక్కర్లు వేసిన టైర్లను పరిశీలించారు. అనంతరం చీపురుపల్లి సీఐ శంకరరావు, గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావులు తమ సిబ్బందితో రేడియం స్టిక్కర్లు వేసిన టైర్లను రోడ్డు మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రతా నియమావళి పాటించాలన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బక్కునాయుడుపేట వద్ద నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో సమావేశమై 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను చక్కగా విని యోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి



రాజాం రూరల్: మాట్లాడుతున్న న్యాయాధికారి శారదాంబ



ఎస్.కోట: మాట్లాడుతున్న న్యాయాధికారి కనకలక్ష్మి



కొత్తవలస: మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ్ చందర్

రాజాం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పనిచేసే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. స్వచ్ఛమైన గాలి, నీరు, పరిశుభ్రమైన వాతావరణం, సరైన ఉష్ణోగ్రతలు కలిగి ఉండాలని ఆమె సూచించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో కేశవ జ్యూట్ కర్మాగారంలో బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో న్యాయాధికారి పాల్గొన్నారు. మానవహక్కుల పరిరక్షణ, వివక్షలేని సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలను, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని న్యాయాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సి.ఐ. హెచ్.ఉపేంద్రరావు , వికాసతరంగిణి ప్రతినిధి టీటీవీ రమణమూర్తి, జ్యూట్‌మిల్ జనరల్ మేనేజర్ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరవంగా జీవించే హక్కు ఉంది..

శృంగవరపుకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించిందని శృంగవరపుకోట న్యాయాధికారి బి.కనక లక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక వివేకానంద విద్యాసంస్థల్లో మనవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయాధికారి మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలతో అందరికీ సమాన అవకాశాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ, సత్యనారాయణ, కరస్పాండెంట్ సీహెచ్‌ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

కాపాడుకోవాలి...

గజపతినగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని న్యాయాధికారి ఎ. విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. మరుపల్లి గ్రామంలోని కస్తూరిబా పాఠశాలలో హక్కులు, పరిరక్షణపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల ప్రిన్సిపాల్ హైమ తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానాలలో రక్షణ..

కొత్తవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ కొన్ని హక్కులు ఉంటాయని... వాటికి భంగం కలిగినప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించి..కాపాడుకోవచ్చని కొత్తవలస న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయ్ చందర్ అన్నారు. బుధవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కొత్తవలస కోర్టు ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి విజయ్ చందర్ మాట్లాడుతూ ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే న్యాయ పోరాటం చేసి పొందే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది ఎంవీఎస్ గిరిబాబు, న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం కొత్తవలస జంక్షన్ వరకు ర్యాలీని నిర్వహించారు.

మానవ హక్కులపై అవగాహన

లక్కవరపుకోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రేగ గ్రామంలో బుధవారం మానవ హక్కులపై అవగాహనా సమావేశం నిర్వహించారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోషియేషన్ జిల్లా కార్యనిర్వాహకులు బండారు నరేంద్ర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోసల కోనయ్య, పి.సురేష్ కుమార్, ఎ.సత్యనారాయణ, రావాడ నాయుడు, కోండ్రపు సత్యం, బొడ్డు నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాల వైపు పయనించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

దత్తిరాజేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ హితవు పలికారు. దత్తిరాజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థి, ఐఏఎస్ అధికారి మిత్తిరెడ్డి కూర్మారావు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో సర్వశిక్ష డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. గత సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి అయిదుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, విలువైన పుస్తకాలతో పాటు నగదు బహుమతులను ఆయన అందజేస్తున్నారు. ఈ బహుమతులను జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, మిత్తిరెడ్డి కూర్మారావు తండ్రి మిత్తిరెడ్డి ఆదినారాయణ విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఉప విద్యాశాఖాధికారి మోహన్‌రావు, తహసీల్దార్ హరికిరణ్, మండల విద్యాశాఖాధికారి సుధాకర్, వెంకటరమణ, హెచ్ఎం శశికళ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరణ

ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ట్రక్ షీట్లను వేగంగా జారీ చేసి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. ఆయన దత్తిరాజేరు మండలంలో బుధవారం పర్యటించారు. పెదమానాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ కొనుగోలు ప్రక్రియను, తేమ కొలిచే విధానాన్ని పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా వీలైనంత వేగంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీసత్య మోడరన్ రైసుమిల్లును తనిఖీ చేశారు. ట్రక్‌షీట్లు, గోనె సంచులను పరిశీలించారు. ట్రక్‌షీట్లు జారీ ఆలస్యం అవుతోందని గుర్తించి వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు ఈ పర్యటనలో తహసీల్దార్ హరికిరణ్, వ్యవ సాయాధికారి అనూరాధ, సీఎస్‌డీటీ సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి గొప్పతనాన్ని చాటిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

జామి, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నతుడు మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం వ్యవ స్థాపకుడు నందమూరి తారక రామరావు అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం జట్టేడివలసలో టీడీపీ అభిమాని గొర్లె అప్పలసత్యం సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన రాయవరపు ముత్యాలు కుటుంబ సభ్యులు నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను తెలుగు జాతి ఎప్పటికీ మరువదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వర్రి రమణ, స్వామినాయుడు, దాసరి కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎక్సైజ్ సిబ్బంది

విజయనగరం క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి అన్నారు. బుధవారం నగరంలోని ఎక్సైజ్ టౌన్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో అధికారులు, సిబ్బందికి మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ, ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుం డా మూడు నెలలకొకసారి వైద్య పరీక్షలు నిర్వహిం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీ రామచంద్రరావు, ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా సూపరిడెంట్‌ంట్ జె.శ్రీనాథుడు, ఏఈఎస్ దొర, సీఐ మన్మథరావు పాల్గొన్నారు.

కొబ్బరి పరిశ్రమలతో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పూసపాటిరేగ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి పరిశ్రమలతో యువత ఉపాధి పొందాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ప్రభుత్వ సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించే దిశగా బుధవారం కోయర్ బోర్డు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొబ్బరి పరిశ్రమల ఏర్పాటుపై మహిళలు, యువత దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోయర్ బోర్డు అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారంపై దృష్టి

విజయనగరం క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో ఇరువర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్, రోడ్డు ప్రమాద కేసులు, పెండింగ్ ఈ చలానాల కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ఇరువర్గాలతో సంప్రదించి రాజీ పడేలా చూడాలన్నారు. పోలీసు స్టేషన్ల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

స్వయం ఉపాధితో మేలు

రేగిడి, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి గ్రూపులు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నాకర్ పేర్కొన్నారు. స్వయంశక్తి సంఘాల బలోపేతంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండోరోజు శిక్షణ తరగతులను డీపీఎం ఎం.చిరంజీవితో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గోవిందరావు, ఎల్‌సీ వెంకట్రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలది కీలక పాత్ర

ఎస్.కోట రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో శిశువులు ఆరోగ్యంగా ఉండడంలో కీలకపాత్ర అంగన్‌వాడీలదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బుధవారం పెదఖండేపల్లి గ్రామంలో పునర్నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు ఆధ్వర్యంలో గ్రామంలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాళ్ల రమణ, ఎంపీటీసీ సభ్యుడు బొదల దేముడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.4.91 లక్షలు

చీపురుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకనక మహలక్ష్మి అమ్మవారికి హుండీ ద్వారా రూ.4,91,807 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎస్.నానాజీబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 సెప్టెంబరు 10 నుంచి డిసెంబరు 10 వరకూ భక్తులు హుండీల ద్వారా అమ్మవారికి సమర్పించిన కానుకలు బుధవారం లెక్కించామన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారి జి. శ్యాంప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారని ఈవో తెలిపారు.

వేతనాలు పెంచండి

వేపాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం పెంచాలని కోరుతూ బుధవారం స్థానిక డిప్యూటీ ఎంపీడీఓ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డు అసిస్టెంట్లు మాట్లాడుతూ మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలని కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆతవ ఈశ్వరమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు నిధులు

చీపురుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9.7 కోట్లు మంజూరు చేసినట్టు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీటిని మంజూరు చేసిందని తెలిపారు.

నీటి ట్యాంకుకు శంకుస్థాపన

గంట్యాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భోనంగి గ్రామంలో మంచి నీటి ట్యాంకు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. వీఎంఆర్‌డీ నిధులతో 90 వేల లీట ర్ల సామర్థ్యంతో ఈ ట్యాంకును నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, తాటిపూడి ఆయకట్టు చైర్మన్ కె.జగన్నాథం, పీఏసీఎస్ అధ్యక్షులు బూడి అప్పలనాయుడు, టీడీపీ నాయకులు రంధి చినరామునాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ట్రాక్టర్ నుంచి జారిపడి యువకుడి మృతి

మెంటాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుర్ల గ్రామ పొలిమేరలో బుధవారం రాత్రి నడుస్తున్న ట్రాక్టర్ నుంచి జారిపడి కోటపర్తి గణేష్ (17) అనే యువకుడు మృతిచెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం మూలవలస గ్రామానికి చెందిన రామవరపు ఎర్రయ్య, కోటపర్తి గణేష్ విజయనగరంలో సిమెంటు ఇటుకలు కొనుగోలు చేసి తిరిగి వస్తున్నారు. గుర్ల గ్రామానికి కాస్త ముందు రోడ్డుపై గతుకుల కారణంగా ట్రాక్టర్ డ్రైవర్ రామవరపు ఎర్రయ్య పక్కన కూర్చున్న కోటపర్తి గణేష్ కుదుపులకు కింద పడిపోయాడు. ఆయన మీదుగా వెనుకచక్రాలు వెళ్లడంతో తలభాగంతో పాటు శరీరమంతా నుజ్జయింది. అక్కడికక్కడే మృతి చెందిన గణేష్‌ను చూసి డ్రైవర్ ఎర్రయ్య షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకుని ఎర్రయ్యకు సపర్యలు చేయడంతో కోలుకున్నాడు. ఆండ్ర ఎస్ఐ సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి ఒకరు...

రామభద్రపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రామభద్రపురంలోని దిగువ హరిజన వీధికి చెందిన రేజేటి మురళి (36) ప్రమాద వసాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఆయన భార్య పెంటమ్మ ఫిర్యాదు చేసింది. బుధవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి పొలంలో ఉన్న బావిలో పడినట్లు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెలమల ప్రసాదు తెలిపారు. మృత దేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

మక్కువ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.పెద్దవలస వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మావుడి కొత్తవలసకు చెందిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మావుడికొత్తవలసకు చెందిన చోడిపిల్లి గణేష్, చోడిపిల్లి సాయి, చోడిపిల్లి పరుసు ద్విచక్రవాహనంపై మామిడిపల్లి పీహెచ్‌సీలో ఆరోగ్య పరీక్షలు చేయించుకొని గ్రామానికి తిరుగు పయాణమయ్యారు. ముగ్గురు ద్విచక్రవాహంతో శంబర నుంచి ఎస్.పెద్దవలస మీదుగా మావుడి కొత్తవలస వెళ్తున్నారు. ఆ సమయంలో నంద నుంచి బొబ్బిలి వెళ్లే ఆర్టీసీ బస్సు శంబర వస్తుండగా ఎస్.పెద్దవలస చెరువుగట్టు వద్దగల మలుపులో ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గాయపడిన ముగ్గురిని 108లో సాలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం గర్భిణి చోడిపిల్లి సాయిని విజయనగరం ఘోషాసుపత్రికి, చోడిపిల్లిగణేష్, చోడిపిల్లిపరుసును మహారాజా ఆసుపత్రికి సాలూరు సీహెచ్‌సీ డాక్టర్లు రిఫర్ చేశారు. ప్రమాద వివరాలను సేకరించిన మక్కువ పోలీసులు కేసు నమోదు చేశారు.

1,400లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట రూరల్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని దారబ పంచాయతీ పరిధిలోని కర్రగూడ సమీపంలో బుధవారం ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాసిక్ క్యాన్‌ల్లో నిల్వ ఉంచిన 1,400లీటర్ల పులిసిన బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే 14 ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గాయపడిన వ్యక్తికి సపర్యలు

గంట్యాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామం వద్ద బుధవారం అదుపు తప్పి వాహనం బోల్తా కొట్టిన సంఘటనలో గాయపడిన వ్యక్తికి ఆదే రహదారిలో విధులు నిర్వహణకు వెళ్తున్న ఏఆర్ డీఎస్పీ కోటిరెడ్డి సపర్యలు చేశారు. 108 వాహనంపై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మండలంలోని గింజేరు గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రావవిలస గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే వ్యక్తి గాయ పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆదినారాయణ కొండతామరాపల్లి నుంచి తన స్వగ్రామమైన రావివలసకు వస్తున్నారు. గింజేరు వద్దకు వచ్చే సరికి రహదారిపై వెళ్తున్న మేకలను తప్పిస్తున్న సమయంలో తన ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ గాయపడ్డారు. ఈ ఘటనలో రెండు మేకలు మృతి చెందాయి.

పొట్టేళ్ల స్వాధీనం

జియ్యమ్మవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగనాపురం గ్రామం వెలుపల గొర్రె పందేలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు బుధవారం ఎస్‌బీ జోనల్ స్టాఫ్, ఎస్‌టీఎఫ్ పార్టీతో కలిసి సంయుక్తంగా దాడి చేశారు. ఈ మేరకు రెండు గొర్రె పందెం పొట్టేళ్లు, రూ.1,025 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే అనంతరం కేసు నమోదు చేసినట్లు చినమేరంగి పోలీసులు తెలిపారు.

బాలికావలసలో చోరీ



బాధితులతో మాట్లాడుతున్న సీఐ

రేగిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికావలసలో తాళం వేసిన ఇంట్లో 13 తులాల బంగా రం చోరీకి గురైంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం బాలికావలస గ్రామానికి చెందిన కిలారి కమల కుటుంబ సభ్యులు ఈ నెల 5న ఇంటికి, ఇంట్లో ఉన్న బీరువాకు తాళం వేసి పొలానికి వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళాలు వేసినట్లు ఉండటంతో వీరు గమనించలేదు. మంగళవారం బీరువా తెరిచి చూసేసరికి అందులో ఉన్న 13తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బుధవారం రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్ వివరాలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉపసంహరించే వరకూ పోరాటం

విజయనగరం దాసన్నపేట/గజపతినగరం/నెల్లిమర్ల/ఎస్.కోట/రాజాం/ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్య విధానాన్ని పీపీపీతో ముడిపెడితే.. ఉపసంహరించుకునే వరకూ పోరాడుతామని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం దాసన్నపేటలోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూరాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేశామని తెలిపారు. ఈ నెల 18న గవర్నర్ అబ్దుల్ నజీర్‌ని కలిసి జరిగిన పరిణామాలపై తెలియజేస్తామన్నారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడుల ఆధ్వర్యంలో బుధవారం గజపతినగరం, నెల్లిమర్లలో సంతకాల పత్రాలను సేకరించారు. ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, రాజాంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

వైసీపీ శ్రేణులు దూరం

విజయనగరం దాసన్నపేట, డి సెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కోటి సంతకాల ముగింపు కార్యక్రమానికి విజయనగరం నియోజకవర్గ పార్టీ శ్రేణులు దూరంగా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోలగట్ల ముఖ్య అనుచరులు మాత్రమే హాజరయ్యారు. కార్పొరేటర్లు కూడా పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. దీంతో కార్యక్రమం వెలవెలబోయింది.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



వినతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రహదారులు, గృహాలు, పింఛన్లు, మంచినీటి సరఫరా సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు.గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్‌కార్యాలయంలో గరుగుబిల్లి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ మండలాధ్యక్షుడు మరడాన నారాయ ణస్వామినాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలవాలన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటాలి

- పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో సత్తాచాటి మన్యం జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆకాంక్షించారు. బుధవారం పార్వతీపురంలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఎంపికైన జిల్లాకు చెందిన విద్యార్థినులను విజయచంద్ర అభినందించారు. గత నెల 24, 25 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన పోటీల్లో సత్తాచాటి పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామానికి చెందిన బి.వినీత జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. అలాగే జి.లాస్యప్రియ కాంస్య పతకాన్ని సాధించింది. దీంతో వీరిద్దరిని అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఉమామహేశ్వరరావుపాల్గొన్నారు.

- బెలగాం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని చర్చి సెంటర్‌లో దివంగత మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుచేసేందుకు ఎమ్మెల్యే విజయచంద్ర స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



పాలకొండ: వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఆసుపత్రి కమిటీ సమీక్షించారు.అనంతరం రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఉద్యోగుల హాజరు పరిశీలన

పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని రామకళామందిర్ వార్డు, వీవర్స్‌కాలనీ, భాసూరువారివీధి, సచివాలయాల్లో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రజా సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంలో ఆయా వార్డుల్లో ఉన్న తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో మాట్లాడారు.

- వీరఘట్టం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ఉండాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. బుధవారం మండలంలోని వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అభ్యుదయం సైకిల్ యాత్రలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసకాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉదయాన ఉదయ్‌భాస్కర్, పొదిలాపు కృష్ణమూర్తినాయడు,లక్ష్మీనారాయణ, హరిబాబు, కళాధర్ పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి



కురుపాం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మానవుల హక్కులను పరిరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు.

- పాలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వీరఘట్టం, పార్వతీపురం, సీతంపేట డ్రిగీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సుధాకర్ రెడ్డి, చలపతిరావు, జెన్న, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బిరాజుపాల్గొన్నారు.
- పార్వతీపురంటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే మానవహక్కులపై అవగాహన కలిగిఉండాలని వైస్ ప్రిన్సిపాల్ బి. శాంతకుమారి తెలిపారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం పురస్కరించుకుని మానవహక్కుల గురించి వివరించారు.
- కురుపాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కురుపాం కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ప్యానల్ అడ్వకేట్ బరాటం చంద్రమౌళి మానవ హక్కుల గురించి వివరించారు. అనంతరంవిద్యార్థులతో గ్రామం లో ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. కుమారస్వామి మానవహక్కుల గురించి తెలియజేశారు.

రేపు సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా

పాలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):ధాన్యం రైతులను జరుగుతున్న అన్యాయంపై శుక్రవారం సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పేర్కొన్నారు. బుధవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల సమస్యలపై మంగళవారం రాత్రి సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్‌కు వినతిప త్రం అందించినట్లు పేర్కొన్నారు. ధాన్యం విక్రయానికి మిల్లర్లు అనేక ఇబ్బందులు సృష్టిస్తున్నారని తెలిపారు.

డైట్ బిల్లులు చెల్లించాలి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):వెంటనే డైట్ బిల్లులు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి ఇంతవరకుజీతాలు లేవని తెలిపారు. వసతి గృహాలకు సంబంధించి రెండు నెలల వరకు డైట్ బిల్లులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందుల పడుతున్నారని చెప్పారు.

మహాసభలు విజయవంతం చేయాలి

పాలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ మండల కార్యదర్శి కాద రాము పిలుపునిచ్చారు. బుధవారం పాలకొండలో గ్రీన్ అంబాసిడర్లతో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని తహసీల్దార్ శేఖర్ కోరారు. మండలంలోని జేకేపాడులో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమంలో పిన్సిపాల్ టిశ్రీవరం మాట్లాడుతూ ఏడురోజుల పాటు సాగిన కార్యక్రమంలో శ్రమదానం చేసినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీవో రామయ్య ఏడు రోజుల పాటు జరిగిన కార్య క్రమాలను వివరించారు.

విజయరామరాజుకు పరామర్శ

పార్వతీపురం,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు శత్రుచరన్ల విజయరామరాజును మాజీ మంత్రి, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణా రంగారావు పరామర్శించారు. బుధవారం విశాఖపట్నంలో చికిత్స పొందుతున్న విజయరామరాజును రంగారావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీమాజీ సభ్యుడు వర్మ, మజ్జి కృష్ణమహన్ ఉన్నారు.

హడ్డుబంగి పాఠశాలలో రోబోటిక్ వర్క్‌షాప్

సీతంపేట రూరల్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ పరిధిలోని హడ్డుబంగి గిరిజనసంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో బుధవారం రోబోటిక్స్‌పై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు.మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్‌లో గిరిజన విద్యార్థినులు వివిధ రకాలకు చెందిన రోబోటిక్స్‌కిట్‌ల వంటి సాధనాలతో ప్రయోగాలు చేస్తు ఆవిష్కరణలు చేసారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ నిధులతో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం, వార్డెన్ కస్తూరి తెలిపారు.

వారం రోజుల్లో ఎల్పీ సర్టిఫికెట్లు: పీవో

సీతంపేట రూరల్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో పీఎం జన్‌మన్ పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లను మంజూరు చేస్తామని ఐటీడీఏ ఇన్‌చార్జిపీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.మంగళవారం ఆంధ్రజ్యోతిలో అనుమతులు రాక..కట్టుకోలేక శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఇన్‌చార్జి పీవో స్పందించారు. సీతంపేట ఏజెన్సీలోని నారాయణ గూడలో నివసిస్తున్న పీవీటీజీ గిరిజనులకు పీఎం జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన గృహాల నిర్మాణాలకు అటవీశాఖ అభ్యంతరాలు తెలియజేడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- జిల్లా వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన

ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు.ఈ బుధవారం జిల్లా వ్యాప్తంగా ఫీల్డ్‌అసిస్టెంట్లు తమసమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో నిరసన తెలియజేసి అధికారులకు వినతిప త్రాలు అందజేశారు.

- గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ కోరారు. గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఫీల్డ్‌అసిస్టెంట్లు ధర్నా నిర్వహించి ఎంపీడీవో జయలక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు చంద్రశేఖర్, పి.శ్రీనివాసరావు, టి.మోహన్‌దాస్, ఏ.శంకరరావు, వి.రమణమ్మ, సత్యవతి, కె.గౌరీశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ పాల్గొన్నారు.



గరుగుబిల్లి: ఎంపీడీవో పైడితల్లికి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

- జియ్యమ్మవలస, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అల్లు సత్యనారాయణ, రాము, వెంకటనాయుడు పాల్గొన్నారు.
- గరుగుబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లికి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ నాయకులు నల్ల సూర్యనారాయణ, ఎన్.ఆదినారాయణ వినతిపత్రం అందజేశారు. 19 ఏళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రతలేదని తెలిపారు.



గుమ్మలక్ష్మీపురం:ఎంపీడీవో జయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



జియ్యమ్మవలస: ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్



మాట్లాడుతున్న వెంకటేష్

బెలగాం, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధక్షులు సీహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. బుధవారం పార్వతీపురంలోని గిరిజన సామాజిక భవన్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మహాసభలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ విద్యా రంగం నాశనమవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రాథమిక పాఠశాలలను సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేసేలా చర్యలు చేపడుతున్నాయని ఆరోపించారు. పీటీఎంల సంబరాలు ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం కాకుండా పాఠశాలల సమస్యలు పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాచలం, అనిల్ పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు చేయాలి

జియ్యమ్మవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులనుంచి నీటి తీరువా వసూలుచేయాలని తహసీల్దార్ ఎస్.అప్పారావు కోరారు. బుధవారం జియ్యమ్మవలసలో వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు, పెండింగ్‌లో ఉన్న పీజీఆర్ఎస్‌లు, నీటి తీరువా వసూళ్లు, రీసర్వేలతో పాటు మరికొన్ని అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీటీ శివయ్య, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీతారామరాజు పాల్గొన్నారు.

జబ్బవాపు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

జియ్యమ్మవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే జబ్బవాపు వ్యాధి విషయంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.మునికుమార్ తెలిపారు. బుధవారం తాళ్లడుమ్మలో పశువులకు జబ్బవాపు వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అను, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలింతలకు వైద్య పరీక్షలు

గరుగుబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకడివరంలో 104 వాహనం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎంకే తిరుమలప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 సంవత్సరాలు పైబడిన వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామస్థాయి వైద్య సిబ్బంది పరిధిలో నయం కాకపోతే పీహెచ్‌సీకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శిరీష, సుబ్బలక్ష్మి, 104 సిబ్బంది శంకరరావు, రమేష్, ఆశావర్కర్లు, ఆర్.విజయ పాల్గొన్నారు.

రేంజర్‌గా రవికుమార్

పార్వతీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపుర అటవీశాఖ రేంజర్‌గా రవికుమార్ నియామితులయ్యారు. విజయనగరంలో డిప్యూటీ రేంజర్ గా పనిచేస్తున్న రవికుమార్ పార్వతీపురం రేంజర్‌గా గురువారం బాధ్యత స్వీకరించనున్నారు. ఇప్పటివరకూఇన్‌చార్జి రేంజర్‌గా మణికంఠేష్ వ్యవహరించారు.

కోసలిలో ఆటస్థలం అభివృద్ధి

భామిని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలి జిల్లా పరిషత్ పాఠశాల ఆటస్థలాన్ని హైదరాబాద్‌లో నివాసముంటున్న గ్రామానికి చెందిన నెయిగాపుల వైకుంఠరావు అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చారు. ఇక్కడి ప్రాథమికోన్నత పాఠశాల జడ్పీ పాఠశాలగా 2025-26 విద్యా సంవత్సరంలో అప్‌గ్రేడ్ చేశారు. అయితే పాఠశాలను ఆనుకొని ఉన్న ఆటస్థలంలో మట్టి పేరుకుపోవడంతో ఆడుకోవడానికి వీలుగాలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల పీటీఎం సమావేశంలో ఉపాధ్యాయులు క్రీడా మైదానం కోసం చైర్మన్ కొత్తూరు మధుతోపాటు తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గ్రామ పెద్దలు హైదరాబాద్‌లో ఉన్న గ్రామానికి చెందిన నెయిగాపుల వైకుంఠరావుకు ఆటస్థలం సమస్యను వివరించారు. ఈ నేపథ్యంలో పాఠశాల ఆటస్థలం చదునుచేయడానికి ఆయన ముందుకొచ్చారు. ఆటస్థలం అభివృద్ధిచేయడంపై హెచ్‌ఎం కె.సిధు, సిబ్బందితో పాటు స్థానికులు నెయిగాపుల అప్పలస్వామి, నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు.

సీతానగరం పోలీస్‌స్టేషన్ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీషారెడ్డి

సీతానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీతానగరం పోలీస్‌స్టేషన్‌ను పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ వంగలపూడి మనిషారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు సీఐ రంగనాథం, ఎస్ఐ ఎం.రాజేష్, సిబ్బంది ఉన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

సీతంపేట రూరల్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలు, రహదారి భద్రతపై దోనుబాయి ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. బుధవారం దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తకోట జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు సైబర్‌నేరాలు, హెల్మెట్ వినియోగం,మితిమీరిన వేగం,రహదారి,మహిళల భద్రతపై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై త్రినాథరావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్ కోరారు. బుధవారం గరుగు బిల్లి వెలుగు కార్యాలయంలో వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లతో పాటు వీవోఏలకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

సీతంపేట రూరల్,డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ప్రధాన రహదారిపై బుధవారంరాత్రి కొత్తూరు నుంచి పాలకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డుపై మొరాయించింది.పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిపై ఎయిర్‌లాక్ సమస్యతో ఆర్టీసీ హైర్ బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఇతర వాహనాల్లో వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

కోటి సంతకాల ర్యాలీ

పాలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏలాం జంక్షన్‌లో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సంతకాల పత్రాలను వాహనం పార్వతీపురంలోని జిల్లా పార్టీ కార్యాలయానికి పంపించనున్నట్లు ఎమ్మెల్సీ విక్రాంత్ పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే కళావతి పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

సీతానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి అధికంగా వసూళ్లు చేస్తున్న మిల్లర్ల దోపిడీని అరికట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. బుధవారం సీతానగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మిల్లర్లంతా ఒక్కటై రైతుల నుంచి 42 నుంచి 45 కేజీల వరకు ధాన్యం తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఒక పక్క 40.200 కేజీలు మిల్లర్లకు ఇవ్వాలని రైతులకు చెబుతోందని, కానీ మిల్లర్లు మాత్రం ఆ విధంగా పాటించడం లేదని తెలిపారు. ఈ విషయంపై మండల అధికారులు పర్యవేక్షణలో ఉంటే గాని మిల్లర్లు ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర గాని, తూకాన్ని గాని సరిచేయరన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఆర్.రాము, రెడ్డి రమణమూర్తి, గార వెంకటరమణలు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో వైద్య శిబిరం

సీతానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):లక్ష్మీపురంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 245 మందికి పరీక్షలు చేశారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

(7వ పేజీ తరువాయి)

తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. క్రమం తప్పకుండా చదివి ఎక్కడ మార్కులు సాధించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పి.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి పనులు వేగవంతం

సీతంపేట రూరల్: సీతంపేట ఏరియా ఆసుపత్రితో పాటు మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆసుపత్రి పనులను పరిశీలించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించ కూడదన్నారు. నిర్మాణం పూర్తయితే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని తెలిపారు. ఈ పరిశీలనలో ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు, ఏపీఎంఐడీసీ అధికారులు ఉన్నారు.

ముస్తాబు అదుర్స్!

(7వ పేజీ తరువాయి)

దోహ దపడే ఇటువంటి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని సూచించారు.

- జిల్లాలో 1,703 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1,14,531 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తంగా అన్ని స్కూళ్లలోనూ 'ముస్తాబు'ను అమలు చేస్తున్నారు. కాగా ఈ కార్యక్రమంపై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచివాలయంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం ఆనందంగా ఉందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో పిల్లల పరిశుభ్రతతో పాటు వారి ఆరోగ్యాలపై ప్రత్యేకగా దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో ముస్తాబు కార్య క్రమం విజయవంతంగా జిల్లాలో అమలు చేస్తున్నామని వెల్లడించారు.

భామిని పర్యటనలో తెలుసుకున్న సీఎం

భామిని ఆదర్శ పాఠశాలలో ఈ నెల ఐదో తేదీన నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి హాజరైన సీఎం 'ముస్తాబు' గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశ వేదికపై కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించిన ముస్తాబు కార్యక్రమం నిర్వహణపై ఓ విద్యార్థిని వివరించింది. ఆ తర్వాత మధ్యాహ్న భోజన సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ముస్తాబుపై మరోసారి విద్యార్థినులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.